క్లుప్తంగా

గురుకుల విద్యార్థులకు శిక్షణ

తాళ్లగడ్డ(సూర్యాపేట): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు ఉన్నతి ఫౌండేషన్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా గురుకుల పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఇమాంపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్. పద్మ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ చదివి ఖాళీగా ఉన్న పూర్వ విద్యార్థులకు గురుకుల సొసైటీ నుంచి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 25 సంవత్సరాలలోపు ఉన్న గురుకుల పూర్వ విద్యార్థులు అర్హులని తెలిపారు. పూర్వ విద్యార్థులంతా ఇమాంపేట గురుకుల పాఠశాలలో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

జాజిరెడ్డిగూడెం తహసీల్దార్‌గా శ్రీకాంత్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల తహసీల్దార్‌గా శ్రీకాంత్ నియమితులయ్యారు. సూర్యాపేట ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడి తహసీల్దార్ శ్రీనివాసులు మర్రిగూడకు బదిలీపై వెళ్లారు.

సౌడమ్మ జాతర

తుంగతుర్తి : మండల కేంద్రంలో జరుగుతున్న సౌడమ్మ జాతరలో మంగళవారం కూడా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వేడుకలకు వట్టె జానయ్య యాదవ్ హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కుంభం వెంకన్న యాదవ్, లింగయ్య యాదవ్, ఉప్పుల నాగమల్లు యాదవ్, బోయిని భాస్కర్ యాదవ్, ఆవుల అంజయ్య యాదవ్ తదితరులు ఉన్నారు.

సీపీఐ నూతనకల్ మండల కార్యదర్శిగా ప్రభాకర్‌గౌడ్



నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన తొట్ల ప్రభాకర్ గౌడ్ సీపీఐ మండల కార్యదర్శిగా నాలుగోసారి మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మద్దిరాల మండలం ముకుందాపురం గ్రామంలో నిర్వహించిన ఉమ్మడి మండల మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌గౌడ్ మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి నాలుగోసారి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు ఎల్లెంల యాదగిరి, రైతు సంఘం అధ్యక్షుడు మూరగుండ్ల లక్ష్మయ్య, దేసోజు భాస్కరాచారి, బండి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అమావాస్య పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణం పాత బస్టాండ్ సమీపంలోని సాయిబాబా ఆలయంలో మంగళవారం అమావాస్య సందర్భంగా త్రిమూర్తులు ఉన్న చెట్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రావి చెట్టు, వేప చెట్టు, మేడి చెట్ల చుట్టూ 21 ప్రదక్షిణలు చేసి రాగి చెంబుతో నీళ్లు పోసి పూజలు చేశారు. అంతకుముందు గంగా పార్వతి సహిత శివ సాయి ఆలయంలో శివుడికి అన్నాభిషేకం చేసి పూలతో అలంకరించారు. అనంతరం గోశాలలోని గోవులకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, అర్చకులు విశ్వేశ్వర శర్మ, గంగాధర్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

సీపీఎం పెన్‌పహాడ్ మండల కార్యదర్శికి పరామర్శ

పెన్‌పహాడ్ : సీపీఎం మండల కార్యదర్శి గుంజా వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బాధపడుతుండగా మంగళవారం మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో ఆయనను సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, సీపీఎం మండల నాయకులు రణపంగ కృష్ణ, బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

బెల్లి లలిత వర్ధంతి



జాజిరెడ్డిగూడెంలో లలిత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అర్వపల్లి : తెలంగాణ తొలిదశ ఉద్యమకారిణి, గాయకురాలు బెల్లి లలిత 26వ వర్ధంతిని జాజిరెడ్డిగూడెంలో సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా లలిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బెల్లి లలిత కుమారుడు సూర్యప్రకాష్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, పూలే–అంబేడ్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపకుడు ఈదురు వీరపాపయ్య, బాలు, దయాకర్, శ్రీరామ్, మురళి, నరేష్, వజ్జె సాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. ఎన్నాళ్లీ చింత





సూర్యాపేట పట్టణంలోని అంజనాపురి కాలనీ వద్ద జనగామకు వెళ్లే రహదారిపై ఏర్పడిన గుంతలు

సూర్యాపేట మున్సిపాలిటీలోని అంజనాపురి కాలనీ నుంచి వెళ్లే జనగామ రోడ్డు మొత్తం గుంతలమయమైంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు దెబ్బతిన్నది. జనగామ క్రాస్ రోడ్డులో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు కొనసాగుతుండటంతో ప్రస్తుతం జనగామ వైపు నుంచి వచ్చే ప్రయాణికులు, సూర్యాపేట నుంచి జనగామ వైపు వెళ్లే ప్రయాణికులు అంజనాపురి కాలనీ రోడ్డు నుంచి వజ్రటౌన్ షిప్ పక్కన గల రోడ్డు గుండా వెళ్తున్నారు. ఈ రహదారిలో వాహనాల రాకపోకలు ఎక్కువ సంఖ్యలో పెరగడంతోపాటు ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు మొత్తం దెబ్బతిని గుంతలమయమైంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదమరిస్తే ప్రయాణికులు గుంతలోపడి గాయాలపాలయ్యే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

మత్తు రహిత సమాజ స్థాపనకు కృషి



కొత్తబస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రభాకర్

సూర్యాపేటటౌన్ : మత్తు పదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్న యువతకు సందేశాలతో కనువిప్పు కలిగిస్తూ మత్తు రహిత సమాజ స్థాపనకు తనవంతు కృషి చేస్తున్నానని ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రయాణికులకు అవగాహన కల్పించారు. మద్యపానం, ధూమపానం ఆరోగ్యానికి హానికరమని, డ్రగ్స్ వద్దు ప్రాణమే ముద్దు.. సేవ్ లైఫ్ అంటూ కరపత్రాలు పంచారు. చేతిలో మైకు పట్టుకుని ఫ్లెక్సీతో విచిత్ర వేషధారణతో ప్రచారం నిర్వహిస్తున్నారు.

వైభవంగా జలబిందెల ఊరేగింపు, పూజలు

పెన్‌పహాడ్: పెన్‌పహాడ్ మండల పరిధిలోని చెట్లముకుందాపురంలో నూతనంగా శ్రీకనకదుర్గ, గ్రామదేవతల ఆలయాలు నిర్మించనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం గ్రామంలో భక్తిశ్రద్ధలతో జలబిందెల ఊరేగింపు, పూజలు చేపట్టారు. గ్రామంలోని వీధుల గుండా మహిళలు జలబిందెలతో ఊరేగింపుగా తరలివెళ్లి శ్రీసీతారామాలయంలో శంకులకు జలాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. బుధవారం శ్రీకనకదుర్గాదేవి, మారెమ్మ, కట్టమైసమ్మ, ముత్యాలమ్మ, మహంకాళమ్మ, బొబ్బిలమ్మ, అంకాళమ్మ, పోతురాజుల దేవాలయాల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శ్రీ కనకదుర్గమ్మ, గ్రామ దేవతల ఆలయాల నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.

గుంటకండ్ల సావిత్రమ్మ వర్ధంతి



నాగారంలో సావిత్రమ్మ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

నాగారం : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మాతృమూర్తి గుంటకండ్ల సావిత్రమ్మ 12వ వర్ధంతిని మంగళవారం జగదీష్‌రెడ్డి స్వగ్రామమైన నాగారం మండల కేంద్రంలో నిర్వహించారు. నాగారం మండల కేంద్రంలోని సావిత్రమ్మ స్మారక ఘాట్ వద్ద ఎమ్మెల్యే తన తండ్రి గుంటకండ్ల రామచంద్రారెడ్డి, కుటుంబ సభ్యులతో కలిసి సావిత్రమ్మకు నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, గుండగాని అంబయ్య గౌడ్, మాజీ ఎంపీపీ కూరం మణివెంకన్న, కల్లెట్లపల్లి శోభన్‌బాబు, చిప్పలపల్లి సోమయ్య, చిరంజీవి, కన్నెబోయిన భద్రయ్య, కన్నెబోయిన మల్లేష్, బాలమ్మ, సైదులు, యాదగిరి, ఎల్లయ్య, బాలు, కుటుంబ సభ్యులు పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అనువైన ప్రాంతాల్లో సదస్సులు నిర్వహించాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



తిమ్మాపురం ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

భానుపురి : భూభారతిలో భాగంగా జూన్ 3వ తేదీ నుంచి జరిపే రెవెన్యూ సదస్సులను ప్రజలకు సౌకర్యవంతంగా ఉండే ప్రాంతాల్లో నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి కలెక్టరేట్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. దరఖాస్తులు స్వీకరించేటప్పుడు దరఖాస్తుతో పాటుగా రైతు భూములకు సంబంధించిన పత్రాలు తప్పక ఉండేలా చూడాలన్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించే రోజును ముందుగా ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలని తెలిపారు. రేషన్ కార్డులలో పేర్ల మార్పుల విషయంలో, కార్డుల విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని అన్నారు. ఈ సమావేశంలో సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్, కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, అన్ని మండలాలకు చెందిన తహసీల్దార్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు మంజూరు చేయాలి

నూతన పరిశ్రమలకు అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సీతారామ్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ, టీజీఐపాస్ కమిటీల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వివిధ పరిశ్రమలకు సంబంధించిన అనుమతులపై సమీక్షించారు. సమావేశంలో సీటీఓటీ యాదగిరి, ఎల్‌డీఎం బాపూజీ, డీటీడీఓ శంకర్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ ఎల్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యం బస్తాలు త్వరగా మిల్లులకు పంపాలి

అర్వపల్లి: కొనుగోలు కేంద్రాల్లో కాంటాలైన ధాన్యం బస్తాలను నిర్వాహకులు త్వరగా మిల్లులకు పంపాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ కోరారు. మంగళవారం జాజిరెడ్డిగూడెం, తిమ్మాపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. రిజిస్టర్‌లను పరిశీలించి మాట్లాడారు. లారీలను సర్దుబాటు చేసి కొనుగోలు కేంద్రాలకు పంపిస్తామని వెంటనే కాంటాలైన బస్తాలను మిల్లులకు తరలించాలని సూచించారు. వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకొని కప్పాలని కోరారు. ఎక్కువ మంది హమాలీలను నియమించుకొని వెనువెంటనే లారీల్లో ధాన్యం బస్తాలు లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాలశాఖ డీఎం ప్రసాద్, స్థానిక తహసీల్దార్ చిప్పలపల్లి యాదగిరి, ఎంపీడీఓ టి. గోపి, గిర్దావర్లు ఆర్. జలేందర్‌రావు, పాటి వెంకట్‌రెడ్డి, నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

అన్నదానం ఏర్పాటు అభినందనీయం



శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం వద్ద అన్నదానం చేస్తున్న క్లబ్ సభ్యులు



అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్టు ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం వద్ద మంగళవారం అమావాస్య తిథి సందర్భంగా వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వీ104ఏ రీజియన్–6 వాసవీ యూత్ క్లబ్ అధ్యక్షుడు వెంపటి రవితేజ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. అన్నదానంతో పేదలు, బాటసారుల ఆకలి తీర్చడం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని అన్నారు. అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ గుమ్మడివెళ్లి శ్యాంసుందర్, రీజియన్ సెక్రటరీ యమా సంతోష్, ఐఈసీ శింగిరికొండ రవీందర్, బిక్కుమల్ల కృష్ణ, వెంపటి శబరినాథ్, పబ్బతి వేణుమాధవ్, రాచకొండ శ్రీనివాస్, మణికంఠ, శ్రీరంగం రాము, నాగరాజు, యామా సుధాకర్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్టు ఆశ్రమంలో..

అన్నిదానాల్లో అన్నదానం గొప్పదని అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్టు ఆశ్రమ నిర్వాహకురాలు దేవరకొండ వనజ అన్నారు. పట్టణంలోని 1వ వార్డు శ్రీఅన్నపూర్ణ చారిటబుల్ ట్రస్టు ఆశ్రమంలో బట్టిపల్లి రవి, అంజలి దంపతుల కూతురు రమ్య పుట్టిన రోజు సందర్భంగా మానసిక వికలాంగులకు మంగళవారం అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బట్టిపల్లి సంజయ్, గునగంటి అంజయ్య, తొండల నాగరాజు, సీహెచ్.నరేష్, అమూల్య, వైశాలిని, ప్రీతిక, స్ఫూర్తి, శ్రావ్య, భవిత పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రంలోని విశ్వ భారతి పాఠశాలలో 2006–07 విద్యా సంవత్సరం పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు మంగళవారం మండల కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులు, మిత్రులతో తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ, మల్లారెడ్డి, పాషా, సునీల్‌రెడ్డి, విద్యార్థులు మహేంద్రచారి, త్రిశూల్, శ్రీధర్, సంతోష్‌రెడ్డి, మాధవి, విజయ, అనూష, సాహితి, రాజశేఖర్, వెంకట్‌రెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మాదిగ సామాజిక వర్గానికి ప్రాధాన్యం కల్పించాలి

నూతనకల్ : రాష్ట్రమంత్రి వర్గ విస్తరణలో మాదిగ సామాజిక వర్గానికి ప్రాధాన్యం కల్పించాలని కాంగ్రెస్ నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు పాల్వాయి నాగరాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు నకిరేకంటి వెంకన్న కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మరికంటి అంబేడ్కర్, పల్సా లింగయ్య, మట్టిపెల్లి గంగయ్య, పన్నాల ఆశిరెడ్డి, కందుకూరి శ్రీకాంత్, బత్తుల మల్లయ్య, శ్రావణ్‌కుమార్, సురేష్, వీరబాబు, అశోక్ పాల్గొన్నారు.

జలగం జనార్దన్‌కు నివాళి

అర్వపల్లి : సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు జలగం జనార్దన్ 4వ వర్ధంతిని మండల పరిధిలోని కొమ్మాల గ్రామంలో సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తుల తో ర్యాలీ జరిపారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, పగిడి సోమయ్య, కె.ధర్మాజి, ఎం.నర్సయ్య, శిగ రంజిత్, కె. వెంకటయ్య, జి. మల్లయ్య, ఆడెపు సోమయ్య, ఉపేందర్, వినయ్, భాస్కర్ పాల్గొన్నారు.

వేలం నిర్వహించాలి

చివ్వెంల : బి.చందుపట్ల గ్రామంలోని ఊర చెరువు తామర పువ్వుల వేలాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీఓ సంతోష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లయ్య గ్రామస్తులకు సమాచారం అందించకుండా, ఎటువంటి తీర్మానం చేయకుండా తనకు నచ్చిన వ్యక్తులకు రూ.70 వేలకు విక్రయించారని అన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని, వేలంపాట నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిగ వీరస్వామి, శిగ శ్రీను, గునగంటి అంజయ్య, యర్రబోయిన శ్రీను, శిగ భిక్షపతి, కోడి రవి, బయ్య వెంకన్న, లింగాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశయసాధనకు కృషి చేయాలి

అర్వపల్లి : నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసిన పోలెబోయిన యాగయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్ కోరారు. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో మంగళవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు పోలెబోయిన యాగయ్య 4వ వర్ధంతిని నిర్వహించారు. యాగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి. మధు, తడకమళ్ల సంజీవ్, పోలెబోయిన పెద్దలింగయ్య, గ్రామకార్యదర్శి బయ్యన్న రిటైర్డ్ పీఈటీ ఎల్లెంల కొమిరెల్లి, పీవైఎల్ నాయకులు పి. మధుకర్, లింగంపల్లి విజయ్ పాల్గొన్నారు.

1, 2తేదీల్లో సీపీఐ సభలు

చివ్వెంల : మండల కేంద్రంలో జూన్ 1, 2 తేదీల్లో జరిగే సీపీఐ మండల మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతంపై నిర్వహించే ఈ సభలకు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.కార్యక్రమంలో రేగటి లింగయ్య, ఖమ్మంపాటి రామలింగం, అయితరాజు లింగయ్య, పాదిల వెంటకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి



చివ్వెంల : మాట్లాడుతున్న సూర్యాపేట, తుంగతుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు

చివ్వెంల: తుంగతుర్తి మండలం గొట్టిపర్తి గ్రామానికి చెందిన తుంగతుర్తి బార్ అసోసియేషన్ సభ్యుడు బానోతు ప్రతాప్‌పై భూ పంచాయతీ విషయంలో దాడికి పాల్పడిన దుండగులను వెంటనే శిక్షించాలని సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, తుంగతుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ అన్నారు. మంగళవారం సూర్యాపేటలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌తో చికిత్స పొందుతున్న న్యాయవాదిని పరామర్శించి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కారింగుల వెంకటేశ్వర్లు, అనిల్ కుమార్, వీరేష్ నాయక్, ప్రకాశ్, గోపి, అనిల్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



మద్దిరాల : పోలుమల్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ అప్పారావు



తిరుమలగిరి : జలాల్‌పురంలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ హరిప్రసాద్

మద్దిరాల : వర్షాల దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కాంటాలను వేగవంతం చేయాలని జెడ్పీ సీఈఓ అప్పారావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పోలుమల్లలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఏపీఎం మైసయ్య, సీసీ రమేష్ పాల్గొన్నారు.

తిరుమలగిరి : కొనుగోలు కేంద్రాలలో కాంటాలు అయిన ధాన్యం బస్తాలను వెంట వెంటనే మిల్లులకు తరలించాలని తిరుమలగిరి తహసీల్దార్ హరిప్రసాద్ కోరారు. మంగళవారం జలాల్‌పురం గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో మరో రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయని తెలిపారు. రైతులకు కొనుగోళ్లు జరిగిన వెంటనే ఖాతాలలో డబ్బులు పడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం మధుసూదన్, ఆర్ఐ సుజిత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు



వర్ధమానుకోటలో యోగాపై అవగాహన కల్పిస్తున్న ఆయుష్ డాక్టర్ విజయేందర్

నాగారం : యోగాతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ విజయేందర్ అన్నారు. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దశాబ్ది వేడుకల సందర్భంగా మంగళవారం వర్ధమానుకోటలోని ఆయుర్వేద, గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆశ కార్యకర్తలకు, అంగన్‌వాడీ టీచర్లకు, గ్రామ వలంటీర్లకు యోగా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. నిత్యం యోగా చేయడం వల్ల శారీరక రుగ్మతలు తొలగి, మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. మానసిక ఒత్తిడిని జయించడానికి, ప్రశాంత జీవనం గడపడానికి యోగా ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. ఈ నెల 27 నుంచి జూన్ 21 వరకు 25 రోజుల పాటు యోగా దశాబ్ది వేడుకలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్లు ప్రణవి, సతీష్, యోగా ట్రెయినర్ ఎస్.శిరీష, పంచాయతీ కార్యదర్శి అంబేడ్కర్, కారోబార్ చొల్లేటి శ్రీనివాసచారి, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



ఆత్మకూర్(ఎస్) : అరెస్టయిన మాజీ సర్పంచ్‌లు

తిరుమలగిరి : పెండింగ్ బిల్లులు చెల్లించాలనే డిమాండ్‌తో హైదరాబాద్‌లో నిరసనకు మాజీ సర్పంచ్‌లు పిలుపు ఇవ్వడంతో మండలంలోని మాజీ సర్పంచ్‌లను పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ అక్రమ అరెస్టులు చేయడం సరైంది కాదని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌లు ఆకుల వీరయ్య, జాటోతు రవి, దేవా తదితరులు ఉన్నారు.

తుంగతుర్తి : సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తాజా మాజీ మాజీ సర్పంచ్‌లు యాకు నాయక్, గుగులోతు వీరోజీ అన్నారు. రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం పిలుపుమేరకు హైదరాబాద్ వెళ్తుండగా పోలీసులు వారిని ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

ఆత్మకూర్(ఎస్) : పెండింగ్ బిల్లులు చెల్లించాలని హైదరాబాద్‌లో నిరసనకు మాజీ సర్పంచ్‌లు పిలుపు ఇవ్వడంతో మండలంలోని మాజీ సర్పంచ్‌లను పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచులు లింగా నాయక్, గంపల దావీదు తదితరులు ఉన్నారు.

మద్దిరాల : మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను విడుదల చేయకపోవడం పట్ల హైదరాబాద్‌లో నిరసనకు పిలుపు ఇవ్వడంతో మంగళవారం మద్దిరాల మండలంలోని సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌లు దామెర్ల వెంకన్న, అక్కిరెడ్డి జ్యోతి ఉపేందర్‌రెడ్డి, బర్పటి ఉంపేదర్, వల్లపు యాకయ్య, తదితరులు ఉన్నారు.

పీడీఎస్‌యూ నాయకుడు లింగన్నకు నివాళి



నూతనకల్ : లింగయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

సూర్యాపేట అర్బన్ : విద్యార్థుల హక్కుల కోసం అవిశ్రాంతంగా ఉద్యమించి, పీడీఎస్‌యూ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పనిచేసిన వీరబోయిన లింగయ్య మృతి ఉద్యమాలకు తీరనిలోటు అని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి అన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు మండడి శ్రీధర్, పవన్, మహేష్, నవీన్, వినయ్, రాకేష్, భరత్, ప్రవీణ్, కిరణ్, భాస్కర్ పాల్గొన్నారు.

నూతనకల్ : పీడీఎస్‌యూ విద్యార్థి నాయకుడు వీరబోయిన లింగన్న మృతి తీరనిలోటని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో లింగయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. లింగన్న గత కొద్దిరోజుల నుంచి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేసోజు మధు, మండడి భూపాల్‌రెడ్డి, గంటా కార్తీక్, గుండెబోయిన గణేష్, సురేష్ పాల్గొన్నారు.

వన నర్సరీ పనుల పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి

పెన్‌పహాడ్ : నర్సరీల్లోని మొక్కల సంరక్షణకు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నర్సరీని సందర్శించి మాట్లాడారు. మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులు అందజేసిన దరఖాస్తులను ఆయన పరిశీలించారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.